మట్టి గణపతి విగ్రహాల తయారీపై విద్యార్థులకు వర్క్‌షాప్



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పద్మశ్రీ హిల్స్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణేష్ విగ్రహాల తయారీపై వర్క్‌షాప్‌ను కాలనీ విద్యార్థులకు విజయవంతంగా ఏర్పాటు చేశారు. బాలగోకులం ఆర్గనైజేషన్ సంస్థ మట్టి వినాయకుల శిక్షణ తయారీ విధానాన్ని విద్యార్థులకు నేర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. ఈ వర్క్‌షాప్‌లో పిల్లలు సొంతంగా మట్టి గణపతిని చేయడం వల్ల పిల్లలకు వికాసం, మనోధైర్యం వృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బాల గోకులం ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు అనిల్, నవీన్, సంతోష్, అసోసియేషన్ సభ్యులు సతీష్, సావర్కర్, ఉమామహేశ్వర్‌రెడ్డి, రవి, అమరేందర్‌రెడ్డి, సఫీ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలి



శిక్షణ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని ప్రముఖ కళాకారుడు ప్రకాష్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని యాదాద్రి కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల తయారీపై విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు విద్యార్థులు ఇప్పటి నుంచే బాధ్యతగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేష్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం ప్రారంభం



జ్యోతి ప్రజ్వాలన చేస్తున్న డాక్టర్ శ్రవంతి ఎల్లసిరి

బండ్లగూడ: తెలంగాణ యూత్ ఐకాన్-2021 డాక్టర్ శ్రవంతి ఎల్లసిరి స్థాపించిన ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ రియల్ ఎస్టేట్ ల్యాండ్ స్కేప్‌లో కొత్త శకానికి గుర్తుగా సన్‌సిటీలో అధికారికంగా తన ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ వ్యవస్థాపకురాలు, సీఈఓ డాక్టర్ శ్రవంతి ఎల్లసిరి విజయవంతమైన డెంటల్ కెరీర్ నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తగా మారారు. ఎస్ ఇన్‌ఫ్రా ఒకే హబ్‌లో ప్లాట్లు, విల్లాలు, వాణిజ్య ఆస్తులతో సహా సమగ్రమైన రియల్ ఎస్టేట్ ఎంపికలను అందించడానికి కట్టుబడి ఉందన్నారు. ఎస్ ఇన్‌ఫ్రా హైట్స్ ఇప్పుడు డీటీసీపీ రేరా ఆమోదించిన ప్రాజెక్ట్, హిల్ కౌంటీ, బాలానగర్, బెంగళూరు హైవే వద్ద అందిస్తుందన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి మంటలు



హుడా కాలనీలో విద్యుత్ తీగలు తగిలి కాలుతున్న కటౌట్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పంచవటి కాలనీ రోడ్డు నెంబర్ 5లో ఆదివారం ఉదయం విద్యుత్ వైర్లు ఒకదానికి మరొకటి తగలటంతో పెద్ద ఎత్తున మంటలు వచ్చాయి. వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో సరఫరాను నిలిపి మరమ్మతులు చేశారు. అదే తరహాల్లో ఆదివారం రాత్రి హుడా కాలనీలో వినాయక ఉత్సవాలకు ఏర్పాటు చేసిన స్వాగత కౌటట్లకు విద్యుత్ వైర్లు తగలటంతో మంటలు లేచి అవి పూర్తిగా తగిలిపోయాయి. ఆ సమయంలో అటుగా ఎవరూ వెళ్లకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేసే పనులను విద్యుత్ శాఖ చేపట్టకపోవటంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రూపారెడ్డికి ప్రశంస



ప్రశంస మెమోంటోను అందుకున్న రూపారెడ్డి

మణికొండ: ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తదాన శిబిరాలు, వ్యక్తులను సంసిద్ధం చేసి వందలాది మందికి రక్తదానం చేయించిన మణికొండ కృషి ఫౌండేషన్ అధ్యక్షురాలు పి.రూపారెడ్డిని తలసీమియా సొసైటీ వారు ప్రశంసించారు. ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె సేవలను గుర్తించి తలసీమియా సొసైటీ ప్రతినిధులు ఆమెను సత్కరించి, మెమోంటోను అందజేశారు. ఈ సందర్భంగా రూపారెడ్డి మాట్లాడుతూ.. ఆసుపత్రులలో అత్యవసర చికిత్సలు, శస్త్ర చికిత్సలు చేసుకుంటున్న వారికి రక్తం ఎంతో అవసరం పడుతుందన్నారు. అలాంటి వారి రక్తం అవసరాలను తీర్చేందుకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి రోజు ఉత్సాహవంతులను సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. తమ సేవలను మెచ్చి వారు ఆదివారం సత్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో తలసీమియా సొసైటీ నాయకురాలు కె.రత్నావలి తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర కాలనీలో విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరును తొలగిస్తున్న సిబ్బంది



ఓంనగర్ కాలనీలో విద్యుత్ తీగలపై పడిన చెట్టు

దంచికొట్టిన వాన

● రోడ్లన్నీ జలమయం ● స్తంభించిన జన జీవనం



కేబీ.దొడ్డి వద్ద ఈసీవాగులో..

బండ్లగూడ: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని రహదారులపై వరదనీరు వచ్చి చేరడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. వర్షంతో పాటు ఈదురు గాలులు వేయడంతో ఓంనగర్ కాలనీలో విద్యుత్ తీగలపై చెట్టు పడటంతో విద్యుత్ సరఫరాకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. వెంకటేశ్వర కాలనీ, యాదవమిత్ర కాలనీ కృష్ణానగర్ కాలనీలలో పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. కార్పొరేషన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో అత్యవసర సహాయక సిబ్బంది యాదగిరి, రాము, రాజు, అనీల్‌తో కలిసి రాకపోకలకు ఇబ్బందిగా నేలకొరిగిన చెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వెళ్లే రహదారి వైష్ణవి ఓవైసీస్ సమీపంలో వర్షపునీరును భారీగా నిలవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

పొంగి పొర్లుతున్న వాగులు..

శంషాబాద్ రూరల్: భారీ వర్షాలకు ఆదివారం మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఈసీవాగులోని వరద పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలను ముంచెత్తాయి. ఇక ఎంటేరువాగులో వరద కారణంగా సుల్తాన్‌పల్లి–కేబీ.దొడ్డి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎవరూ ఇటు వైపు రాకుండా పోలీసులు బారికేడ్లను అడ్డుగా పెట్టి చర్యలు చేపట్టారు.

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో..

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో రోడ్డు నెంబర్-5, 8లలో రెండు చెట్లు విద్యుత్ వైర్లపై కూలాయి. దీంతో పంచవటి, హనుమాన్‌నగర్ ఫీడర్ల పరిధిలో రోజంతా విద్యుత్ సరఫరాకు అంతారాయం కలిగింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి చెట్ల కొమ్మలను తొలగిస్తున్నా ఇలాంటి వర్షాలు కురిసే సమయంలో అవి విద్యుత్ వైర్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు తగలటంతో సరఫరాకు అంతారాయం కలుగుతుంది. శేరిలింగంపల్లి మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురవటంతో అక్కడి నీరంతా పండెన్ వాగు ద్వారా మూసీ నదికి చేరింది. దీంతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పండెన్ వాగు పొంగి ప్రవహించింది. ఈవీవీ కాలనీ వద్ద వంతెన పైనుంచి నీరు పారటంతో రాకపోకలను నిలిపివేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో అక్కడక్కడ లోతట్టు ప్రాంతాల్లో కొంత వర్షం నీరు నిలవటం, అరగంటలో తిరిగి కాళీ కావటం కనిపించింది.



ఈవీవీ కాలనీ వద్ద రాకపోకలను నిలిపివేయిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఏఈ



సుల్తాన్‌పల్లి శివారులో రోడ్డుపై నుంచి పారుతున్న ఎంటేరువాగు



పంచవటి కాలనీలో విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు

పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేయించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో బీజేపీపై ఆసక్తి ఉన్న వారు వేలాదిగా ఉన్నారని, వారందరినీ కలిసి పార్టీలో చేర్పించాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో అధ్యక్షుడు భిక్షపతియాదవ్ అధ్యక్షతన ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు ఉన్న పార్టీగా బీజేపీ రికార్డు సాధించిందన్నారు. ఈ సంవత్సరం వాటిని మరింత పెంచి ఇతర పార్టీలకు అందని స్థాయిలో ఉంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మన రాష్ట్రంలో పెద్ద ఎత్తున సభ్యత్వాలను పార్టీ అధిష్ఠానం కోరుతుందని, ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికీ తిరిగి సభ్యత్వాలు చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. నగేష్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు శేఖర్‌అప్ప, నాయకులు నవీన్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



అశోక్

శంషాబాద్ రూరల్: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్కాజిగిరి అశోక్(50) కల్లుకు బానిసగా మారాడు. అనారోగ్యంతో రెండు వారాల నుంచి కల్లు తాగడం మానేశాడు. దీంతో అతను మానసికం సరిగా లేక పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం అన్ని చోట్ల వెతికి ఆచూకీ తెలియకపోవడంతో శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దృశ్యాదృశ్య జ్ఞాన సంగమమే మానవ జీవితం

రాయదుర్గం: కంటికి కనిపించేది మాత్రమే సత్యమనీ, మనకి కనిపించనంత మాత్రాన నిజం లేదనుకోవడానికి లేదని హెచ్‌సీయూ తెలుగు విభాగం పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అమెరికాలోని సిరోకన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వాసిలి రచించిన ఏడో రుతువును ఎంతో తాత్వికంగా చెప్పారని అన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దర్భ శయనం, చంద్రశేఖర్ రచించిన చిగురించిన శిలాజం కవితా సంపుటి ఆవిష్కరణ, డాక్టర్ వాసిలి వసంతకుమార్ రచించిన ఏడో రుతువు కావ్య పరిచయాలను చేశారు. కార్యక్రమంలో పలువురు తెలుగు రచయితలు, ఫ్యాకల్టీ ప్రతినిధలులు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినంగా నిరసన



రాజేంద్రనగర్ ఏఆర్ఐ ధర్నా చౌక్ వద్ద పెన్షన్ విద్రోహ దినంగా నిరసనలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు రాజేంద్రనగర్ జేఏసీ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఉద్యోగుల జేఏసీ రాజేంద్రనగర్ ఏఆర్ఐ ధర్నా చౌక్ వద్ద ఆదివారం పెన్షన్ విద్రోహ దినంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు యూనివర్సిటీలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పాల్గొన్నారు. ఉద్యోగ నాయకులు, రాజేంద్రనగర్ జేఏసీ మాజీ చైర్మన్, కో చైర్మన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ జనరల్ సెక్రటరీ ఎస్.అమృత్ రెడ్డి, డాక్టర్ సురేశ్, వెటర్నరీ యూనివర్సిటీ షర్ఫుద్దీన్, ప్రెసిడెంట్ నయీముద్దీన్, మాజీ జేఏసీ చైర్మన్, కో చైర్మన్ యాదయ్య, భిక్షపతి, రమేశ్, జ్ఞానేశ్వర్, పెన్షనర్స్ అసోసియేషన్ అంజయ్య గౌడ్, నాగుల యాదవ్, ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు జహంగీర్ పాల్గొని పెన్షన్ విద్రోహ దినంగా నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగలస్తులకు బాకీ ఉన్న ఐదు డీఏలలో నాలుగు తక్షణమే విడుదల చేస్తూ పీఆర్సీ కమిటీలు ఏర్పాటు చేసి పీఆర్సీకి అడుగులు వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మణికొండలో జలమండలి ఎండీ పర్యటన



గండిపేట క్యాండూట్‌లో నగరానికి సరఫరా అవుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎండీ

మణికొండ: జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గండిపేట నీటిని స్థానికంగా ఫిల్టర్ బెడ్‌ల ద్వారా చేస్తున్న క్లోరినేషన్, గండిపేట క్యాండూట్‌లో సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. స్థానికంగా ఉన్న నీటి ట్యాంకర్ల డిమాండ్, సెక్రటేరియట్ కాలనీలో పలు గృహాలకు వెళ్లి నీటి సరఫరాపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ నీటి మీటర్లు ఏర్పాటు చేశారా.. గండిపేట నీరు నాణ్యతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నాణ్యతతో కూడిన నీటిని సరఫరా చేయాలని, వర్షాకాలం కావడంతో చెరువులు, నదుల్లోకి కొత్తనీరు వచ్చి చేరుతుందని, దాన్ని మరింత పటిష్ఠంగా క్లోరినేషన్ చేయాలని సూచించారు.

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి



అలకాపూర్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు వంశీకృష్ణ

మణికొండ: ఆరోగ్యవంతులు వీలైనన్ని ఎక్కువ సార్లు రక్తదానం చేయాలని మణికొండ మున్సిపాలిటీ వాసవి కపుల్స్ క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం రెడ్‌క్రాస్ వారి సహకారంతో తమ క్లబ్ తరపున అలకాపూర్ టౌన్‌షిప్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆసుపత్రులలో రక్త నిలువలు తగ్గడంతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని తెలుసుకుని శిబిరం ఏర్పాటు చేశామన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా వందలాది మంది ఇందులో పాల్గొని రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి టి. యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మన్ కె.నిరీష, రీజియన్ చైర్మన్ జి.నవీన్‌కుమార్, రీజియన్ కార్యదర్శి రామ్ సురేష్, జిల్లా ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీలో కనీస వసతులు కరువు

శంషాబాద్ రూరల్: పాల్మాకులలోని కేజీబీవీలో కనీస వసతులు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్.నర్సింహ ఆరోపించారు. ఆదివారం పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థినులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. భోజనం సరిగా పెట్టకుండా విద్యార్థినులకు కులం పేరుతో దూషించడం దారుణమన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, నిధుల మంజూరులో జాప్యంతో ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. వసతి గృహాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

త్వరలో బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయం



గోల్కొండ: తెలంగాణలో త్వరలోనే బీఆర్ఎస్ కనుమరుగు కావడం ఖాయమని ఇక్కడ కాంగ్రెస్‌కు గట్టి ప్రత్యామ్నాయం బీజేపీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ బీజేపీ నాయకులతో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి సన్మానించారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పార్టీని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారని ఆయన అన్నారు. అదే విధంగా ఇచ్చిన హామీలను అమలు పరచక ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీకి కూడా ప్రజల ఆదరణ బాగా తగ్గిందని ఆయన అన్నారు. గుల్బార్గ జిల్లా బీజేపీ ప్రభారి ఈశ్వర్‌సింగ్ ఠాకూర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహ కార్యదర్శి ప్రభు పూజారి, అమర్‌నాథ్ తదితరులున్నారు.

ముగిసిన శ్రావణమాస పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు రంగనాథ చార్యులు, శేషచారి, బద్రీనాథ్

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో శ్రావణమాసం పూజలు ఆదివారంతో ముగిశాయి. నెల రోజులుగా శ్రీదేవి, భూదేవి సమేతా రంగనాథస్వామి వారికి, గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శన సౌభాగ్యం కల్పించారు. ఆలయంలో ప్రతి శుక్ర, శనివారాలలో దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణలు, ఆరాధన, అభిషేకం, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రతినిధి శేషాచార్యులు అర్చకులు రంగనాథచార్యులు, బద్రీనాథ్ మాట్లాడుతూ..ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు చతుర్మాసం అంటారని ఆ సమయంలో నారాయణుడు విష్ణుమూర్తి యోగ నిద్రలోకి వెళ్తాడని లోకాన్ని పాలించేది లక్ష్మీదేవి అమ్మవారని, చతుర్మాసంలో లక్ష్మీదేవిని ఆరాధించడం ఎంతో శ్రేయస్కరమన్నారు. సంతానం లేనివారు పూజిస్తే సంతానం కలుగుతుందని ప్రసిద్ధి అని తెలిపారు.